క్లుప్తంగా

విద్యార్థినులతో ఇంటి పనులు

దుమ్ముగూడెం: మండలంలోని రామచంద్రునిపేట గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో హెచ్ఎం, వార్డెన్, సిబ్బంది ఇంట్లో రోజూ వంట చేయడం, ఊడ్చడం, బట్టలు ఉతకడం వంటి పనులు చేయిస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు భూపేందర్ అన్నారు. తల్లిదండ్రులు బిడ్డలను చదువుల కోసం గిరిజన ఆశ్రమ పాఠశాలలకు పంపిస్తే ఉపాధ్యాయ సిబ్బందే విద్యార్థినులతో పనులు చేయించడం క్షమించరాని చర్య అన్నారు. తక్షణమే ఈ ఘటనపై అధికారులు తగు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

సేవలు అభినందనీయం


మొక్క నాటుతున్న భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలంఅర్బన్: గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో పట్టణంలోని మిమ్స్ హాస్పిటల్ సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం శాసన సభ్యుడు పొదెం వీరయ్య హాజరై మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. గ్రీన్ భద్రాద్రి ప్రధాన కార్యదర్శి శ్రీరంగం సంపత్, కోశాధికారి విష్ణు మొలకల సుబ్రహ్మణ్యం, సైనిక్ బోర్డు డైరెక్టర్ తిప్పన సిద్ధులు, మాజీ అధ్యక్షుడు డాక్టర్ గోళ్ల భూపతి రావు, భోగాల శ్రీనివాస రెడ్డి, కామిశెట్టి కృష్ణార్జున రావు, చావా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు ఆకిశెట్టి ఉమా శంకర్ నాయుడు పాల్గొన్నారు.

శిఖరాలకు చేరుకోవాలి

దుమ్ముగూడెం: విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని చదువుల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. గురువారం లక్ష్మీనగరం గ్రామంలోని కేరేగుబల్లి ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో ఏమేమి అవుతారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌యం ధనసరి నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీపీఆర్ఈ

దమ్మపేట: జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం మండల పరిధిలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో ఎమ్మెల్యేను కలిసిన పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని పంచాయతీ రాజ్ విభాగంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. దమ్మపేట పంచాయతీ రాజ్ జేఈ శ్రీధర్ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

కరకగూడెం: మండల పరిధిలోని వీరాపురం గ్రామంలో గురువారం కరకగూడెం ఆయుర్వేద వైద్యాధికారి సీహెచ్ కుమారస్వామి నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆయన సుమారు 75 మంది గ్రామస్తులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామీణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎన్ఓ శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

దీక్ష విరమణ

భద్రాచలంటౌన్: పట్టణంలోని మనుబోతుల చెరువులో నిర్మిస్తున్న ఇళ్ల కోసం స్థానిక మహిళలు చేస్తున్న దీక్షను గురువారం విరమించారు. స్థానిక మహిళలు నాలుగు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలుసుకున్న ఆర్డీఓ మంగీలాల్ న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానన్ని హామీ ఇచ్చారు. దీంతో దీక్షను విరమించిన మహిళలు మాట్లాడుతూ.. తమకు న్యాయం జరగకపోతే మరో సారి దీక్ష చేస్తామని అన్నారు.

నూతన కమిటీలు లేవు..

దుమ్ముగూడెం: భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో టీడీపీ పాత మండల కమిటీలే నడుస్తాయని నూతన కమిటీలను ఇంకా ఏర్పాటు చేయలేదని మహబూబాబాద్ పార్లమెంటరీ అధ్యక్షుడు కొండపల్లి రామచంద్రరావు తెలిపారు. గురువారం ములకపాడు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ నూతన కమిటీ ఏర్పాటు అంటూ ఎవరైన ప్రకటనలు ఇస్తే చెల్లవని, అలాంటివేమీ ఏర్పాటు చేయలేదని స్పష్టం చేశారు. మహబూబాబాద్ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొడాలి శ్రీనివాస్, జనరల్ కార్యదర్శి ఎస్‌కె.అజీమ్, అధికార ప్రతినిధి ప్రేమ్ చంద్, భద్రాచలం నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కొమరం ఫణీశ్వరి, సుబ్బారెడ్డి, ఇల్లెందు ఇన్‌చార్జ్ ముదిగొండ వంశీ, కోనేరు రాము, కాశయ్య, మండల అధ్యక్షుడు కొమరం దామోదర రావు తదితరులు పాల్గొన్నారు.

నెలలు నిండకుండానే జననం

- ఏజెన్సీలో బరువు తక్కువతో చిన్నారులు
- గర్భంలో ఉన్నప్పుడే సమస్యలు
- జాగ్రత్తలు పాటించకపోవడమే కారణం


తక్కువ బరువుతో జన్మించిన శిశువులకు చికిత్స అందిస్తున్న వైద్యులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: నవమాసాలు మోయకుండానే తక్కువ బరువు, నెలలు నిండకుండా పిల్లలు (ప్రీమెచ్యూర్) పుడుతున్నారు. కొందరు పురిటిలోనే కన్నుమూస్తున్నారు. గర్భిణికి ఒత్తిళ్లవల్ల దారితీస్తున్న ఈ పరిస్థితులు ఏజెన్సీలోనూ కనిపిస్తున్నాయి.

గర్భిణీ అయిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు వ్యక్తిగతంగా చేసుకునే పనులకంటే ఇతరత్రా పనులు పైనే సమయాన్ని కేటాయించి ఒత్తిడికి గురవడం, ఇన్‌ఫెర్టిలిటీ చికిత్సలతో ప్రీమెచ్యూర్ బేబీ ప్రసవాలకు ఆస్కారంగా మారుతోంది. దీని మూలంగా నెలలు నిండకుండా శిశువులు, తక్కువ బరువు ఉండే బిడ్డలు జన్మిస్తున్నారు. సాధారణంగా 37 వారం నుంచి 41 వారాల తరువాత శిశువు బయటకు రావాల్సి ఉంటుంది. అయితే ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో 24 వారాల నుంచి 36 వారాల వరకు మాత్రమే ఉండి జన్మించిన వారు 203 మంది చిన్నారులు ఉన్నారు. 25 నుంచి 32 వారాలలోపు పుట్టిన పిల్లలకు అన్ని సదుపాయాలు ఉన్న వార్డులో చేర్పించి మెరుగైన వైద్యం అందించాల్సి ఉంటుంది. 28 నుంచి 32 వారాల లోపు పుట్టే పిల్లలకు నవజాతు శిశువు వార్డుల్లో చికిత్స అందిస్తారు. 32 నుంచి 34 వారాల లోపు శిశువులో కిలో కంటే తక్కువ బరువు ఉంటే ప్రత్యేక చికిత్స అందించాలి. 34 వారాల దాటిన తర్వాత జన్మించే శిశువులు 1.82 కిలోల బరువు ఉంటే ప్రమాదం ఉండదు. వారిలో శ్వాస కోశ సంబంధిత సమస్యలు, ఇతర జబ్బులు లేకపోతే ఇబ్బంది ఉండదు.

ఇతర కారణాలూ కావొచ్చు..

గర్భిణులకు ఒత్తిడితో పాటు మధుమేహం, బీపీ వంటి సమస్యలు తోడైతే అది మరింత ప్రమాదకరంగా మారుతుంది. వారు తీవ్రమైన ఒత్తిళ్లకు గురైతే ప్రెగ్నెన్సీ ఇండ్యూస్ట్ హైపర్‌టెన్షన్‌కు దారి తీస్తుంది. హైపర్‌టెన్షన్ వల్ల రక్తప్రసవణలో ఆటంకాలు ఏర్పడి బిడ్డ ఎదుగుదల నిలిచిపోతోంది. కొందరికీ బీపీ వల్ల ఫిట్స్ రావడం, వాంతులు కావడం వల్ల శిశువు పెరుగుదల సరిగ్గా ఉండదు. ఏజన్సీ ప్రాంతం అయిన భద్రాచలంలో నిత్యం ఇలాంటి చిన్నారులు జన్మిస్తునే ఉన్నారు. కానీ దీనిలో ఎక్కడా మార్పు రావడం లేదని ఆరోపణలు వినిపిస్తునే ఉన్నాయి.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం



ప్రీమెచ్యూర్ బేబీకి తల్లి పాలు ఇవ్వాలి. దీని వల్ల క్రమంగా బరువు పెరుగుతారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గర్భిణి సమయంలో తీసుకోవాల్సిన పౌష్టికాహారం తీసుకోకపోవడం, ఇతర కారణాల వల్ల ప్రీమెచ్యూర్ శిశువులు ఎక్కువగా జన్మిస్తున్నారు. ఇలా జన్మించిన శిశువులకు అన్నివిధాలుగా మెరుగైన వైద్య చికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ కైలాష్ మోహన్, నవజాత శిశు, పిల్లల వైద్య నిపుణుడు, ఏరియా ఆస్పత్రి భద్రాచలం

బిడ్డ పెరుగుదలపై శ్రద్ధ పెట్టాలి



గర్భావతి అయిన సమయం నుంచి ప్రసవం జరిగే సమయం వరకు గర్భిణులు ఎటువంటి పని ఒత్తిళ్లు, తదితర విషయాలపై ఆలోచనలు పెట్టుకోకుడదు. గర్భిణులు వీలైనంత ప్రశాంతంగా ఉండాలి. నిత్యం కడుపులో పెరుగుతున్న బిడ్డను దృష్టిలో పెట్టుకుని తల్లి సరైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలి .అపుడే కడుపులో పెరుగుతున్న బిడ్డ ఆరోగ్యంగా ఉంటారు.

– డాక్టర్ స్పందన, స్త్రీ వైద్య నిపుణులు, భద్రాచలం

పారదర్శకంగా అర్హుల ఎంపిక


కృష్ణసాగర్‌లో గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజారావు

బూర్గంపాడు: గృహలక్ష్మి పథకంలో అర్హుల ఎంపిక పారదర్శకంగా జరుగుతోందని తహసీల్దార్ రాజారావు అన్నారు. కృష్ణసాగర్, ముసలిమడుగు గ్రామపంచాయతీలలో గృహలక్ష్మి అర్హులను గుర్తించేందుకు గురువారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి సొంత స్థలం ఉన్నదీ లేనిది అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. గృహలక్ష్మి పథకం కోసం ఎవరూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐలు ముత్తయ్య, నర్సింహారావు, సర్పంచ్ కొడెం వెంకటేశ్వర్లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీపీఎంను ఆదరించండి


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం నియోజకవర్గంలో ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేసే సీపీఎంకు పట్టం కట్టి ఆదరించాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. పార్టీ భద్రాచలం పట్టణ కమిటీ సమావేశం ఎం.రేణుక అధ్యక్షతన బండారు చందర్ రావు భవన్ వద్ద గురువారం జరిగింది. ఈ సమావేశంలో మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. భద్రాచలం నియోజకవర్గంలో తమ పార్టీ నుంచి ఎమ్మెల్యేలుగా పనిచేసిన ముర్ల ఎర్రయ్యరెడ్డి, కుంజా బొజ్జి, సున్నం రాజయ్య, ఎంపీగా పనిచేసిన డాక్టర్ మీడియం బాబురావులు నిజాయితీతో సేవలందించారని, వారి వారసత్వాన్ని గెలిపించుకోవాలని అన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శివర్గ సభ్యుడు బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్, ఎస్.లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు డి.సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి నిర్వాసితుల వినతి

అశ్వాపురం: హైదారాబాద్‌లోని ప్రగతి భవన్‌లో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుతో కలిసి మండల పరిధిలోని అమ్మగారిపల్లి గ్రామానికి చెందిన సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ భూ నిర్వాసితులు గురువారం రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అమ్మగారిపల్లి గ్రామానికి చెందిన 35 మంది నిర్వాసితులు గతంలో భారజల కర్మాగారం, రాజీవ్‌సాగర్, సీతారామ ప్రాజెక్ట్, సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్‌లో భూములు కోల్పోయి భూమి లేని నిరుపేదలంగా మిగిలామని, సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్‌లో తమ కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మంత్రికి విన్నవించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తానని మంత్రి పువ్వాడ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీరభద్రం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, తూము చిన వీరరాఘవులు, నేలపట్ల కోటిరెడ్డి, ఫకిర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, నరసింహాచారి, నిర్వాసితులు పాల్గొన్నారు.

పోస్టల్ ఇన్సూరెన్స్ చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న పోస్టల్ అధికారులు

దుమ్ముగూడెం: మండల పరిధిలో సున్నం బట్టి గ్రామానికి చెందిన మద్ది ప్రసాద్‌కు భద్రాచలం పోస్టల్ శాఖ ఆఫీస్‌లో వి.సుచేందర్ ఆధ్వర్యంలో గురువారం రూ.11లక్షల 52వేల 749 విలువైన చెక్కును అందజేశారు.

గత ఏడాది జులై నెలలో మద్ది ఆదిలక్ష్మి విద్యుత్ షాక్‌తో మరణించగా.. పోస్టల్ శాఖలో 10 లక్షల పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులు, రెండు సంవత్సరాలు కట్టిన ప్రీమియం కలిపి ఆమె నామినీ, భర్త మద్ది ప్రసాద్‌కు చెక్కు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో దుమ్ముగూడెం ఏఎస్పీయం జానకి రాములు, భద్రాచలం పోస్ట్ మాస్టర్ రామ్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన పల్లె..


ముత్యాలమ్మ గుడి వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

గుండాల: మండల కేంద్రంలో గురువారం శ్రావణమాస బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలైన బొడ్రాయి, ముత్యాలమ్మలకు నైవేధ్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తొలత మండల కేంద్రానికి చెందిన ముత్యాలమ్మ గుడి నిర్మాణ దాత తిరుక్కొవళ్లూరి వెంకన్న -హరిప్రియ దంపతుల ఆధ్వర్యంలో బొడ్రాయి, ముత్యాలమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం చేశారు. అనంతరం గ్రామంలోని మహిళలు బోనాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా వచ్చి అమ్మవార్లకు సమర్పించారు. పసుపు, కుంకుమ, చీరెలను అందించారు. పాలాభిషేకం, జలాభిషేకం నిర్వహించారు. కోళ్లు, మేకలను పోతురాజు వద్ద బలిచ్చారు.

ఫీవర్ సర్వే

మణుగూరురూరల్: మండల పరిధిలోని ఆదివాసీ గిరిజన గ్రామమైన రేగులగండి-సర్వాయిగుంపులో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఫీవర్ సర్వే నిర్వహించారు. సర్వేలో భాగంగా అనుమానితుల రక్తనమూనాలను సేకరించి మందులను పంపిణీ చేశారు. అనంతరం నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో యాంటి లార్వా చేశారు. అనంతరం గ్రామస్తులకు పారిశుద్ధ్యంపై, సీజనల్ వ్యాధులు, వాటి నివారణ చర్యలకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు ఉమేష్, ఏపీ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ఇందిర, ఆశాకార్యకర్త శారద తదితరులు పాల్గొన్నారు.

రికవరీ చేయాలి

గుండాల: కాచనపల్లి రేంజ్ పరిధిలో సస్పెండ్ అయిన హనుమంతు నుంచి తమకు రావాల్సిన డబ్బులను రికవరీ చేయాలని పలువురు రైతులు కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. రేంజ్ పరిధిలో పలువురి రైతుల నుంచి బోర్లు వేయడం, విద్యుల్ లైన్లు ఏర్పాటు, పోడు పట్టాలు ఇప్పించడం కోసం హనుమంతు డబ్బులు వసూలు చేశాడని, మొక్కల తోలకాలు, నర్సరీల్లో పని చేసిన కూలీలకు సైతం కూలి రావాల్సి ఉందని అన్నారు. జిల్లా అధికారులు స్పందించి ఆ డబ్బులు ఇప్పించాలని కోరారు.

నిర్మాణ పనులు ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని గౌరారం పంచాయతీ పరిధిలోని పైడాకులమడుగు గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ రేసు లక్ష్మి, సర్పంచ్ సోడి జ్యోతిలు గురువారం ప్రారంభించారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.4.50లక్షలతో ఈ సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ తుర్రం రాజారావు, మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, గ్రామపెద్దలు కుంజా నాగయ్య, పాండు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని రెడ్డిగూడెం, బండారిగుంపు గ్రామాల్లో గురువారం వినాయకపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ వైద్యులు రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో 56 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి, నలుగురు జ్వర పీడితులను గుర్తించారు. మలేరియా నిర్ధారణ కాలేదు. అలాగే కళ్ల కలకతో బాధ పడుతున్న 9 మందికి పరీక్షలు చేసి, చుక్కల మందు వేశారు. అనంతరం సీజనల్ వ్యాధులు, జ్వరాలు, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. శిబిరాల్లో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, హెచ్‌ఈఓ రాజు, సిబ్బంది సత్యనారాయణ, కృష్ణవేణి, ఆశ కార్యకర్త పార్వతి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

చర్ల: మండలంలోని కలివేరు గ్రామంలో గిరిజనుడి నివాస గృహాన్ని ధ్వంసం చేయడంతో పాటు అడ్డం వచ్చిన కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం చర్లలో జరిగిన సమావేశంలో ఆయన మట్లాడారు. ఏజెన్సీలో గిరిజనులపై దాడులు అధికమవుతున్నాయని దాడులకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం, పోలీసులు సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల దాడులు పునరావృతమవుతున్నాయని ఆయన అన్నారు. ఏక నర్సింహారావు, కారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి


సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు


అన్నపురెడ్డిపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ఎర్రగుంట, పెంట్లం, అన్నపురెడ్డిపల్లి, తొట్టిపంపు గ్రామాల్లో రూ.90 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను గురువారం ఆయన ప్రారంభించారు. రుణమాఫీకి కృతజ్ఞతగా రైతులు చేపట్టిన కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌క్లబ్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమాలలో ఎంపీపీ సున్నం లలిత, తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్, ఎంపీడీఓ అన్నపూర్ణ, బీఆర్ఎస్‌పార్టీ మండలాధ్యక్షుడు, గుంపెన సొసైటీ చైర్మన్ బోయినపల్లి సుధాకర్, ఎస్సై షాహీన, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: మణుగూరు(మిట్టగూడెం)లోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ దిత్వీయ సంవత్సరంలో స్పాట్ ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022–23లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులు బీఎస్సీ, ఎంపీసీ, ఎంపీసీఎస్, బీకాం(సీఏ), హెచ్ఈసీ, ఈఈపీ గ్రూపులలో చేరేందుకు సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 20వరకు గడువు ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో తక్షణ ప్రవేశానికి ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తమ ధ్రువపత్రాలను నేరుగా కళాశాలకు వచ్చి సమర్పించాలని ప్రిన్సిపల్ జి.స్వప్నకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరానికి ఇంటర్ పాసైన విద్యార్థులు బీఎస్సీ, ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్సీ, బీకామ్ (సీఏ), బీఏ (హెచ్ఈపీ, ఈపీపీ) గ్రూప్‌లో మిగిలి ఉన్న సీట్లలో విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు గడువు ఈ నెల 20 వరకు ఉంటుందని, 21న మెరిట్ జాబితా వెల్లడిస్తామని తెలిపారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు 9550406691, 7901097698, 9705960583.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


ఫుట్‌పాత్ వ్యాపారులకు సూచనలు చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ గురువారం కూనవరం రోడ్డులోని పాత మార్కెట్ వద్ద ఫుట్ పాత్ దుకాణదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వారి దుకాణాలను వెనుకకు జరిపించి ట్రాఫిక్ సమస్యను సర్దుబాటు చేశారు. పాత మార్కెట్లోకి సరుకులు దింపేందుకు నిర్దేశించిన సమయాల్లో మాత్రమే సదరు వాహనాలు రావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

మణుగూరురూరల్: ఈ నెల 25, 26, 27 తేదీల్లో గోదావరిఖనిలో జరగబోయే ఏఐటీయూసీ రాష్ట్ర 16వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆ సంఘం బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్ గురువారం యూనియన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాసభలకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు రామనర్సయ్య, మేకల ఈశ్వర్, పి.పుల్లారావు, ఆవుల నాగరాజు, ఎస్.శ్రీనివాస్, ఎస్‌కె.సుబాని, సురేందర్, కె.శ్రీనివాస్, జి.శ్రీనివాసరావు, రవి, రవికుమార్, సందీప్, గణపతి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ములకలపల్లి: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి, నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేయకపోడం శోచనీయమన్నారు. ములకలపల్లి మండలకేంద్రంలో పోస్ట్ మెట్రిక్ హాస్టల్ (పీఎంహెచ్)ను నిర్మించాలని డిమాండ్ చేశారు. సంఘ జిల్లా సహాయ కార్యదర్శి బోడా అభిమిత్ర, మండల కార్యదర్శి తానం వంశి, కంకటి మేఘన, నందిని, శివ సాయి, ప్రసన్న, పవన్, అనిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పడవలకు డబ్బు చెల్లించాలి

అశ్వాపురం: గత ఏడాది గోదావరి వరదల సమయంలో ప్రాణ నష్టం జరగకుండా నాటు పడవల ద్వారా సేవలు అందించిన తమకు రావాల్సిన రూ.2లక్షల 46వేల నగదును విడుదల చేయాలని మండల పరిధిలోని చింతిర్యాల గ్రామానికి చెందిన మత్స్యకారులు కోరారు. ఈ మేరకు గురువారం బీఎస్పీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఏడాది కాలంగా విన్న విస్తున్నా డబ్బులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ఆలెం కోటి, మల్లేష్, మత్స్యకారులు పాల్గొన్నారు.

సినీ నటుడికి సన్మానం


నటుడు టీవీ.రావును సన్మానిస్తున్న గ్రామస్తులు

మణుగూరురూరల్: తెలుగు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణిస్తున్న మండలంలోని రామానుజవరం గ్రామపంచాయతీకి చెందిన టి.వెంకటేశ్వరరావును గ్రామస్తులు గురువారం సన్మానించారు. టీవీ.రావు సినీ రంగంలో రాణిస్తుండడం ఆనందంగా ఉందని తెలిపారు. గ్రామస్తులు తమ్మిశెట్టి సాంబ, బాడిశ నాగేశ్వరరావు, కుర్రి కృష్ణ, మైప దుర్గాప్రసాద్, కట్ట మహేష్, బాలిని నరేష్, సురేష్, మేకపోతుల నవీన్, గుంజ లోకేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

ఉత్తమ అధికారికి..

దుమ్ముగూడెం: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఎంపీఓగా ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ముత్యాలరావును బీఆర్ఎస్ నాయకులు ఎంపీపీ రేసు లక్ష్మి ఆధ్వర్యంలో సన్మానించారు. గురువారం మండలపరిషత్ కార్యాలయంలో ఆయనను కలిసి అభినందనలు తెలియచేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కణితి రాముడు, జానిపాషా, తునికి కామేష్, దామెర్ల శ్రీనివాసరావు, మోతుకురి శ్రీకాంత్ తురుబాక సర్పంచ్ బుక్యా చందు తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ

చండ్రుగొండ: మండలంలోని తుంగారం, రేపల్లెవాడ పంచాయతీల్లోని ఆటోడ్రైవర్లకు నామా ముత్తయ్య ట్రస్టు ద్వారా సరఫరా చేసిన యూనిఫాంను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ఉన్నం నాగరాజు, సత్తి నాగేశ్వరరావు, మార్తి సత్యనారాయణ, నడిపి కృష్ణయ్య పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట బీజేపీ ధర్నా


మణుగూరురూరల్: ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాల వైఫల్యాలను విమర్శిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మణుగూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రాష్ట్ర ప్రజలను బీఆర్ఎస్ ప్రభుత్వం మాయమాటలతో, పథకాల పేరుతో మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పున్నం బిక్షపతి, చిర్ర సరస్వతి, లింగంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: గృహలక్ష్మి, దళితబంధు, బీసీ కుల వృత్తులకు రూ.లక్ష సాయం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అధికార పార్టీ నాయకుల ప్రమేయం లేకుండా మంజూరు చేయాలని కోరుతూ.. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవికి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఐకార్ మెంబర్ ముస్కు శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తాటిపాముల అయిలయ్య, నియోజకవర్గ విస్తారక్ కొండి ప్రభాకర్‌రావు, కార్యదర్శి కోలా భాస్కర్, నాయకులు బలభద్ర రామకృష్ణ, ఆవుల సత్యనారాయణ, కడమంచి రాజేష్, అలేటి సతీష్, లబ్దిదారులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని భద్రాచలం బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్డీఓకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నిడదవోలు నాగబాబు మాట్లాడారు. కార్యక్రమంలో రామ్మోహన్‌రావు, చక్రవర్తి, సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీహరి, వెంకటసుబ్బయ్య, జయరాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.